క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాటారం: 33 కేవీ వలెంకుంట ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు (బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఏ నాగరాజు, కాటారం ఏఈ ఉపేందర్ తెలిపారు. వలెంకుంట ఫీడర్ పరిధిలోని కాటారం మండలం ధన్వాడ, గంగారం, దామెరకుంట, కొయ్యూర్ పరిధిలోని రుద్రారం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

నియామకం


నియమక పత్రాలు అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: మండల పరిధిలోని పత్తిపల్లి, కాసిందేవ్‌పేట గ్రామ మహిళ కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. మంగళవారం పత్తిపల్లి గ్రామంలో మహిళ కాంగ్రెస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలిపల్లి గ్రామ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మూడ్ సమ్మక్క, కాసిందేవ్‌పేట గ్రామ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మంజులను నియమించారు. నియామక పత్రాలను జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంటోజు పావని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల రాధిక, అల్లూరి సంధ్య, తదితరులు ఉన్నారు.

'ఆ నాయకులకు టీపీఎస్‌తో సంబంధం లేదు'

మంగపేట: మండలానికి చెందిన జన్ను నర్సయ్య, తూముల సదానందానికి అంబేడ్కర్ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల శ్రీహరి, మహిళా అధ్యక్షురాలు దాసరి మమత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీపీఎస్ రాష్ట్ర కమిటీ నుంచి శాశ్వతంగా తొలిగించిన జన్ను నర్సయ్య, తూముల సదానదం ఆధ్వర్యంలో మంగపేట అబేడ్కర్ సంఘం మండల కమిటీని ఈనెల 02న ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర కమిటీకి తెలిసిందన్నారు. సంఘానికి ఎలాంటి సంబంధం లేనటువంటి వ్యక్తులు సంఘం పేరు చెప్పుకుని సంఘాన్ని ఏర్పాటు చేయడం పై తీవ్రంగా పరగణించినట్లు తెలిపారు.

మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు కృషి

కాటారం: మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు కృషి వేస్తామని కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య అన్నారు. ఏఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్ రైతుల పాడిపశువుల గూర్చి ఆరా తీసి మందులు పంపిణీ చేశారు. రైతులు పెద్ద ఎత్తున తమ పశువులు తీసుకొచ్చి అంటువ్యాధులతో పాటు వివిధ రోగాలకు టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూగజీవాలు రైతుల నేస్తాలు అని అవి ఆరోగ్యంగా ఉంటేనే రైతులు వ్యవసాయంలో మంచి లాభాలు ఆర్జిస్తారని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయంలో ముందుకెళ్లేలా వారిని ప్రోత్సహించే విధంగా ఏఎంసీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టడంతో పాటు వారి సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చినాల బ్రహ్మారెడ్డి, డైరెక్టర్ తిరుపతిరావు ఉన్నారు.

ప్రమాదకరంగా రహదారి


అల్లివాగు బ్రిడ్జిపై దెబ్బతిన్న రహదారి


అరుణాచలపురం బ్రిడ్జిపై దెబ్బతిన్న రహదారి

- వాజేడు–భద్రాచలం రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే..
- పట్టించుకోని అధికారులు


జగన్నాథపురం-అరుణాచలపురం మధ్యన దెబ్బతిన్న రహదారి

వాజేడు: వాజేడు–భద్రాచలం రహదారి గుంతలమయంగా మారింది. ఎక్కువగా బ్రిడ్జిల వద్ద రహదారి దెబ్బ తినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై వేసిన తారు మొత్తం లేచి పోవడంతో పాటు గుంతలు పడడంతో వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాల పాలవడమే కాకుండా ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామం నుంచి వెంకటాపురం(కె) మండల కేంద్రం వరకు రహదారి పలు చోట్ల మరమ్మతులకు గురైంది. ఈ రహదారిపై వెంకటాపురం(కె) మండలానికి చెందిన కుటుంబ రావు(50) ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడి వైద్యం పొందుతూ మృతి చెందాడు. జగన్నాథపురం గ్రామం నుంచి వెంకటాపురం(కె) మండలం వరకు పలు చోట్ల దెబ్బతింది. జగన్నాథపురం, అరుణా చలపురం గ్రామాల మధ్యన రహదారిపై తారు లేచి పోయి చిప్స్ బయట పడ్డాయి. అదే విధంగా మొరుమూరు కాలనీ గ్రామ సమీపంలో అల్లి వాగు బ్రిడ్జి వద్ద రహదారి మరమ్మతుకు గురైంది. గుండ్ల వాగు బ్రిడ్జి సమీపంలో ఇదే పరిస్థితి. ఆరుగుంట పల్లి, ప్రగళ్లపల్లి గ్రామాల మధ్య రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. అరుణాచలపురం గ్రామం వద్ద బ్రిడ్జిపై గుంతలు పడి ఇబ్బందికరంగా మారింది. అధికారులు మాత్రం రహదారిని మరమ్మతులు చేయించే విషయంలో పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డును మరమ్మతు చేయాలని కోరుతున్నారు.


అరుగుంట పల్లి వద్ద బురదమయంగా రహదారి

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ఎంఈఓ మల్లయ్య


గెలుపొందిన విద్యార్థులతో ఎంఈఓ మల్లయ్య, ఉపాధ్యాయులు

ఏటూరునాగారం: విద్యార్థులు చదువుతోపాటు ఆట పాటల్లో రాణించాలని ఎంఈఓ మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో కళా ఉత్సవ్–2025 సందర్భంగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సింగిల్ సోలో విభాగంలో ప్రథమ బహుమతి 9వ తరగతి విద్యార్థిని అయితమ్మ ఏహెచ్ఎ షణపురం పాఠశాల, డ్యాన్స్ సోలో క్లాసికల్ ప్రథమ బహుమతి రమ్య జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, ఫోక్ డ్యాన్స్ గ్రూప్‌లో ప్రథమ బహుమతి జెడ్పీహెచ్ఎస్ రామన్నగూడెం, డ్రాయింగ్ 2డీ సోలో ప్రథమ బహుమతి ఏ సమీరా గెలుపొందారని ఎంఈఓ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ కు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు రంజిత్ కుమార్, సారంగం లు వ్యవహరించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ సాంబశివరావు, కోడి వెంకట్, పద్మశ్రీ, రవి సూర్య పాల్గొన్నారు.

మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం


సీతక్క చిత్రపటానికి పాలాబిషేకం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ఏటూరునాగారంలో మైనార్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.1.5 కోట్లను మంజూరు చేసిన మంత్రి సీతక్క చిత్రపటానికి మండల కేంద్రంలో మంగళవారం మజీద్ కమిటీ, కాంగ్రెస్ పార్టీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్ మైనార్టీల సక్షేమం కోసం నిధులు మంజూరు చేశారన్నారు. అనంతరం గోవిందరావుపేటలో మంత్రి సీతక్కను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్, రజాక్, హరీఫ్, సర్కార్, సులేమాన్, ఖాజామోహినొద్దీన్, అప్సర్, ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తందానం చేస్తున్న యువత

కన్నాయిగూడెం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ముప్పనపల్లి సహాయ నిధి గ్రూప్ అధ్యక్షుడు అబ్బు సతీశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని రైతు వేదికలో ముప్పనపల్లి సహాయ నిధి గ్రూప్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 64 మంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. మాజీ మండల ఎంపీపీ జనగం సమ్మక్క, బీఆర్ఎస్ అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, కిషోర్, చిట్టెం శ్రీనువాస్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, అబ్బు రమేష్ సుమన్, దుర్గం రాజేష్, తాటి రాజబాబు పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలి


వినతి ప్రతం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మహేందర్‌జీకి మంగళవారం వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా నాయకుడు జన్ను దేవేందర్ మాట్లాడుతూ.. భూపాల్‌నగర్ గ్రామస్తులకు కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, రాజమౌళి, రవి తదితరులు ఉన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు


వెద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారి జ్యోతి, యోషిత మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 82 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. 16 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకోసం ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. నలుగురిని గైనకాజిస్టు సంప్రదింపులకు ములుగు రిఫర్ చేశారు. అనంతరం మరికాల గ్రామంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ కోటి రెడ్డి, సిబ్బంది రామలక్ష్మి, జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

కాళోజీకి ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. కాళోజీ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన రచనలు, ఆలోచనలు సామాజిక చైతన్యానికి దారితీశాయని వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఏటూరునాగారం: కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీడీ పోచం


వాజేడు: ఎంపీడీఓ కార్యాలయంలో..


ఏటూరునాగారం: డిగ్రీ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు


మంగపేట: కాళోజీ జయంతి వేడుకల్లో పలువురి వేషాధారణతో విద్యార్థులు

సన్మానం


సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వాజేడు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు సహాయకులుగా పని చేస్తున్న బాల చంద్ర మూర్తి, ధనమ్మ, అనూష ముగ్గురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. దీంతో వారిని తహసీల్దార్ శ్రీ నివాస్, ఆర్ఐ కుమారస్వామి, రెవెన్యూ సిబ్బంది శాలువాలతో మంగళవారం ఘనంగా సన్మానించారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

మొగుళ్లపల్లి: కాచి చల్లార్చిన నీటినే తాగాలని డాక్టర్ నాగరాణి అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, కోర్కిశాల గ్రామంలోని కస్తూరిబా బాలికల విద్యాలయం, మోడల్‌స్కూల్, గ్రామాల్లో మొగుళ్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. మోడల్‌స్కూల్‌లో 46 మందికి, కెజీబీవీలో 45, ఎల్లారెడ్డిపల్లిలో 45 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పారిశుభ్రత పాటించాలని సూచించారు.

ఇసుక సొసైటీకి ఐటీడీఏ మట్టి!


హెచ్‌టీసీలో మట్టి తవ్వకాలు చేపట్టిన స్థలం


మట్టి స్థానంలో కుప్పలుగా పోసిన ఇసుక

- ఎలాంటి అనుమతులు లేకుండా తరలింపు

ఏటూరునాగారం: ప్రభుత్వ సొమ్మును ప్రభుత్వ అధికారులు అప్పనంగా అప్పజెప్పడం విడ్డూరంగా మారింది. ఐటీడీఏకు చెందిన హెచ్ఎన్‌టీసీ, చేపల ఉత్పత్తి కేంద్రంలోని మట్టిని జిల్లా ఉన్నతాధికారి చెప్పాడని స్థానిక తహసీల్దార్ ఐటీడీఏ అధికారుల సమాచారం, అనుమతి లేకుండా పది లారీల మట్టిని తోడించి ఇసుక సొసైటీకి దారిని నిర్మాణానికి పంపించడం పూర్తిగా చట్టవిరుద్ధం. సొసైటీ ఇసుక క్వారీ రోడ్డు నిర్మాణం అవసరం ఉంటే ప్రభుత్వ, ప్రైవేటు భూమిలో సంబంధిత యజమాని అనుమతి పొంది ఫీజ్ చెల్లించి మట్టిని తరలించాల్సి ఉంటుంది. కానీ ఐటీడీఏలోని నర్సరీ, చేపల ఉత్పత్తి కేంద్రంలో రాత్రికి రాత్రి జేసీబీలను ఏర్పాటు చేసి మట్టిని తవ్వకపోవడంతో తహసీల్దార్, సొసైటీల అతిఉత్సహంగా కనిపిస్తోంది. ఐటీడీఏ పీఓ, కింద స్థాయి ఉద్యోగులకు సైతం తెలియకుండా ఈ మట్టి దందా నడిపించినట్లు తెలుస్తోంది. ఐటీడీఏ నర్సరీలో పనిచేసే కుమారుడికి అప్పనంగా ఇసుక క్వారీని అప్పగించి మంచిచెడ్డలు చూడడం జిల్లా ఉన్నతాధికారులకు అంత ప్రేమ ఏమిటో అర్థం కావడం లేదు. పేద వాడు చిన్న ఎడ్లబండిలో మట్టిని తీసుకెళితే సీజ్‌లు, కేసులు, అరెస్టు అంటూ నానా హంగామా చేసే రెవెన్యూ అధికారులు ఏకంగా ఐటీడీఏ స్థలంలోనే తవ్వకాలు జరిపారంటే ఎంత విడ్డురంగా ఉందో అర్థం అవుతుంది. అంతే కాకుండా ఆమట్టి ఉన్న స్థలంలో ఇసుకను నింపి చదును చేసి ఏర్పడకుండా చేద్దామనేలోపు వర్షాలు రావడంతో ఇసుకను అక్కడ వదిలేసి చేతులు దులుపుకున్నారు. ఏది ఏమైనప్పటికీ ఐటీడీఏకు చెందిన స్థలంలోని మట్టిని సొసైటీ పేరుతో మట్టిని తరలించకపోవడం ఏమిటని నర్సరీలోని కొంత మంది కూలీలు ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా మట్టిని తరలించడానికి సహకరించిన రెవెన్యూ అధికారులు, సొసైటీ అధ్యక్షుడు పై చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


వెలిశాలలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని అంకుషాపూర్, రామకిష్టాపూర్(టి)లోని గ్రామీణ రోడ్ల మరమ్మతుకు శంకుస్థాపన చేశారు. అలాగే మండలంలోని వెలిశాలలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని అన్నారు. ఇప్పటి వరకు ధ్వంసమైన రోడ్ల మరమ్మతుకు నిధులు సైతం మంజూరు చేశామని అన్నారు. మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, డీఎల్‌పీఓ వీరభద్రయ్య, పీఆర్ డీఈ రవికుమార్, ఏఈ మానసారెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీడీఓ అనిత, ఎంపీఓ గౌడ సురేష్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు దొంతుల శ్రీనివాస్, నాంపెల్లి వీరేశం, శాస్త్రాల కిరణ్, పొన్నం సాంబయ్య, అచ్చె లచ్చన్న, తోడేటి కుమార్ పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి

మొగుళ్లపల్లి: నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో రంగాపురం నుంచి జూకల్ వరకు రూ.30 లక్షలు, ఇస్సిపేటలో ఇస్సిపేట నుంచి చింతలపల్లి వయా పాత ఇస్సిపేట వరకు రూ.100 లక్షలు, ఇస్సిపేట నుంచి వాగోడ్డుపల్లి వరకు రూ.120 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రామకృష్ణ, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రఫీ, ఆకుతోట కుమారస్వామి, తక్కల్లపెల్లి రాజు, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గణపురం: మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో చర్లపల్లి చింతల నుంచి లద్దగొండ వాగు వరకు రూ.కోటి ముప్పై లక్షలు, ఎస్సీ కాలనీ నుంచి లద్దగొండ వాగు వరకు రూ.20 లక్షలు, కోటగుళ్ల నుండి మామిండ్ల పంపు వరకు రూ.50 లక్షలు, కోటగుళ్ల నుంచి స్మశాన వాటిక వరకు రూ.రెండు కోట్ల యైబై లక్షలతో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే బుద్దారం బీసీ కాలనీ నుంచి చెంచు కాలనీ మీదుగా రామంజపూరం వరకు రూ.నాలుగు కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెల్పూరు గ్రామంలోని పంచాయితీ రాజ్ రోడ్డు నుంచి చెల్పూరు మాటు వరకు రూ.కోటి, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కుందయ్యపల్లే నుంచి చెల్పూరు వరకు రూ.కోటీ, రవి నగర్ నుంచి టేకుల పాడు చెరువు వరకు రూ.కోటీతో రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే చెల్పూరు గ్రామ శివారులో మాటు వద్ద రూ.27.5 లక్షలతో ఏర్పాటు చేసిన మోటార్లను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

స్లాబ్ కల్వర్టుకు శంకుస్థాపన

చిట్యాల: మండలంలోని గిద్దెముత్తారం-కాల్వపల్లి గ్రామాల మధ్య ఉన్న లో లేవల్ కల్వర్టుకు రూ.కోటి నిధులతో స్లాబ్ కల్వర్టుగా నిర్మాణం చేపట్టడానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గాజర్ల అశోక్, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, మాజీ జెడ్పీటీసీలు ఓరం సమ్మయ్య ఉన్నారు.

రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు


బురదలో ఇరుక్కుపోయిన కారు

కాటారం: మండలంలోని మేడిపల్లి టోల్‌గేట్ సమీపంలో మంగళవారం కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. టోల్‌గేట్ సమీపంలోకి కారు వస్తున్న క్రమంలో రోడ్డు పక్కకు దిగి బురద పొలాల్లోకి వెళ్లింది. కారు ముందు భాగం బురదలో ఇరుక్కుపోవడంతో కారు కొంత మేర పాడైంది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిసింది.